ఐస్ ఫ్యాక్టరీ వరకు 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపట్టాలి

అల్వాల్: అల్వాల్ ఐజీ విగ్రహం నుంచి ఐస్ ఫ్యాక్టరీ వరకు 100 ఫీట్ రహదారి నిర్మాణం చేయాలని వివిధ కాలనీలవాసులు ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐజీ విగ్రహం నుంచి ఐస్ ఫ్యాక్టరీ వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందన్నారు. 100 అడుగుల రహదారి నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రమాదాలు నివారించవచ్చని అన్నారు. ప్రజల రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని అన్నారు. ఇందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్పందించి అధికారులు ఫోన్ చేసి రహదారి విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, ఏఈఎస్ కాలనీ, వజ్రా ఎన్‌క్లేవ్, సాయిసూర్య, రాయల్ ఎన్‌క్లేవ్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

66 ఫీట్ల రోడ్డును నిర్మించాలి

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడ చిన్మయ్‌మార్గ్, వెంకటాద్రినగర్, రాజానగర్, రాజాశ్రీనివాసనగర్ ప్రాంతాల్లో దశాబ్దకాలంగా నెలకొన్న వరద ముంపు సమస్య నివారణలో అధికారులు, ప్రజా ప్రతినిధులు విఫలమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మిర్జాల్‌గూడలోని ఆంజనేయస్వామి దేవాలయం రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద వారు పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు అధికారులు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. అధికారులు స్పందించి హుడా మాస్టర్‌ప్లాన్ ప్రకారం 66 ఫీట్ల రోడ్డు నిర్మించాలని ఉన్నా విస్తరించడం లేదని తెలిపారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని లేకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలతో పాటు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కుషాయిగూడ: భవిష్యత్‌తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని బీకేనగర్‌లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యంతో భవిష్యత్ తరాల మనుగడ ప్రశ్నార్థకమయ్యే ప్రమాదం ఉందన్నారు. సామాజిక స్పృహతో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్, బాలయ్యగౌడ్ తదితరులున్నారు.

వడ్డెర హక్కుల సాధనకు కృషి

కుషాయిగూడ: వడ్డెర సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా హెచ్‌బీకాలనీకి చెందిన వేముల భవానీ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీధర్, గౌరవ అధ్యక్షుడు రూపని లోకానాథం రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్‌ల చేతుల మీదుగా ఆమెకు నియామకపత్రాన్ని అందజేశారు.

◆ హెచ్‌బీకాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత బోదాసు రవిని వడ్డెర సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. వడ్డెరల న్యాయమైన హక్కుల కోసం పోరాడుతామని, రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించేలా వారిలో చైతన్యం నింపుతామన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఈస్ట్ అన్నపూర్ణ కాలనీలో గ్రేటర్ కాంగ్రెస్‌నేత నెమలి అనిల్‌కుమార్ పర్యటించారు. కాలనీలో జరుగుతున్న బాక్స్‌డ్రెయిన్ పనులను ఆయన పరిశీలించారు. చట్నీబౌల్ హోటల్ పక్కన రోడ్డు నుంచి అన్నపూర్ణ కాలనీ రోడ్డు నెంబర్ 06 మీదుగా కాలనీకి అప్రోచ్ రోడ్డు మంజూరు చేయించాలని కాలనీవాసులు ఆయనను కోరారు. అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించేందుకు కృషిచేస్తామన్నారు. తండా శ్రీకాంత్‌రెడ్డి, పీఎస్ఎన్ చౌదరి, కటార్ల శేఖర్‌బాబు, భానుచందర్‌రెడ్డి, నదీమ్, విలయత్‌ఖాన్, లక్ష్మీపతి, ప్రదీప్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వరూప్‌నగర్ నూతన కమిటీ

ఉప్పల్: డివిజన్ స్వరూప్‌నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా సిద్ధేశ్వర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అభ్యున్నతికి తమవంతు కృషి చేయనున్నట్లు నూతన కమిటీ ప్రకటించింది.

మతిస్థిమితం సరిగా లేని బాలిక అదృశ్యం



ఉప్పల్: మతిస్థిమితం సరిగ్గా లేని బాలిక అదృశ్యమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4న చోటు చేసుకుంది. బచ్చన్న పేట మండలం సాలపల్లీ గ్రామానికి చెందిన రేణుక కుమార్తెకు మతిస్థిమితం సరిగ్గా లేదు. చికిత్స కోసం 1న ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. 3 రోజుల చికిత్స అనంతరం తిరుగు ప్రయాణంలో 4న ఉస్మానియా నుంచి బస్సులో ఉప్పల్ వరంగల్ బస్టాప్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో బస్సుకోసం తల్లి రేణుకా డ్రైవర్‌ను ఆరా తీస్తుండగా.. అంతలోనే బాలిక కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం బాలిక తల్లి ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు ఆహ్లాదం..

పెద్దలకు ఆరోగ్యం !

● పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు ● ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్స్ ఆటవస్తువుల ఏర్పాటు ● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో మౌలిక సదుపాయాలతో పాటు పార్కుల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. పార్కులను అభివృద్ధి చేసి పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెద్దలకు ఓపెన్‌జిమ్‌లు, చిన్నారులు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కులను అభివృద్ధి చేసి వివిధ రకాల ఆటవస్తువులను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

6 పార్కుల్లో ఓపెన్‌జిమ్‌లు ఏర్పాటు..

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 6 పార్కుల్లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), మహిత ఎన్జీవో సహకారంతో ఓపెన్‌జిమ్‌లను అభివృద్ధి చేశారు. వాటిలో బృందావన్ కాలనీ పార్కు, రాఘవేంద్ర కాలనీ పార్కు, చిన్నక్రాంతి కాలనీ పార్కు, శివదుర్గ కాలనీ పార్కు, రాజేష్‌నగర్ కాలనీల్లో పార్కులను అభివృద్ధి చేశారు. అందులో ఓపెన్‌జిమ్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. లక్ష్మీనగర్(హుడా) పార్కులో మాత్రం గతంలో హుడా అధికారులు పార్కును అభివృద్ధి చేయగా.. ఓపెన్ జిమ్‌ను మాత్రమే సంస్థ ఏర్పాటు చేసింది.

4 చోట్ల చిల్డ్రన్స్ పార్కుల అభివృద్ధి

నగర పాలక సంస్థ పరిధిలో చిన్న పిల్లలను దృష్టిలో ఉంచుకుని నాలుగు చోట్ల చిల్డ్రన్స్ పార్కులను అభివృద్ధి చేశారు. నగర పాలక సంస్థ నిధులు రూ. 20లక్షలతో ఆర్ఎన్ఎస్ కాలనీ బస్టాప్ వద్ద, రాజశేఖర్‌కాలనీ, హేమానగర్, మణికంఠనగర్ కాలనీల్లో ఈ పార్కులను ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలు ఆడుకునేలా సర్క్యూలర్ స్వింగ్, రాక్ విత్ స్వింగ్ క్లైంబర్, 6 సీటర్ మెర్రీ గో రౌండ్, రెయిన్‌బో లాడర్, ఆపిల్ రివాల్వింగ్, ఫోర్ సీటర్ సిసా, స్ప్రింగ్ రైడర్ హార్స్, స్ప్రింగ్ రైడర్ డక్, సింగిల్, డబుల్ ఫిల్లర్ మల్టీప్లే స్టేషన్ పరికరాలను ఏర్పాటు చేశారు.

ప్రతి డివిజన్‌లో ఏర్పాటు చేయాలి

ఓపెన్‌జిమ్‌లు, చిల్డ్రన్స్ పార్కులు ప్రజలకు అందుబాటుతో పాటు ఉపయోగకరంగా ఉండటంతో స్థానికుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. దీంతో ఓపెన్‌జిమ్‌లకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. చిల్డ్రన్స్ పార్కులకు కుటుంబసమేతంగా వచ్చే పిల్లలను ఆడిస్తూ.. సేద తీరుతున్నారు. ఆదివారం సెలవు రోజుల్లో ఈ పార్కులకు మంచి స్పందన వస్తోంది. దీంతో మిగతా డివిజన్‌లో కూడా ఓపెన్ జిమ్‌లు, చిల్డ్రన్స్ పార్కులు ఏర్పాటు చేయాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఈ విషయమై పలువురు నేతలు, కాలనీవాసులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



పార్కులో సందడి చేస్తున్న చిన్నారులు

అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చాం



ప్రజలకు ఆరోగ్యంతో పాటు మెరుగైన జీవనానికి ఓపెన్‌జిమ్‌లు, చిల్డ్రన్స్ పార్కులను అభివృద్ధి చేస్తున్నాం. ప్రస్తుతం 6 చోట్ల ఓపెన్‌జిమ్‌లు, 4 చోట్ల చిల్డ్రన్ పార్కులు అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చాం. మిగతా డివిజన్లలో కూడా దశలవారీగా ఓపెన్‌జిమ్‌లు, చిల్డ్రన్స్ పార్కులు అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రజలు కూడా అన్ని విధాలుగా సహకరించాలి.

– శైలజ, కమిషనర్ బోడుప్పల్

సామాన్యులకు ఉపయోగకరం..



ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. బయట ప్రైవేట్ జిమ్‌లు ఉన్నా.. అవి పేదలకు అందుబాటులో లేవు. దీంతో పేద ప్రజలంతా పార్కుల్లో ఏర్పాటు చేసి జిమ్‌ల పట్ల ఆసక్తి చూపుతున్నారు. చిల్డ్రన్స్ పార్కులు చాలా బాగున్నాయి. ఇంట్లో పిల్లలు ఫోన్, టీవీలకు బానిస అవుతున్నారు. వారి దృష్టి మరల్చి దూరం చేసేందుకు ఈ చిల్డ్రన్స్ పార్కులు ఎంతో ఉపయోగపడతాయి.

– బండి మల్లేష్, జ్యోతినగర్ కాలనీ

'ఎన్‌ఎఫ్‌సీ' బ్రిడ్జిని విస్తరించాలి



ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: డివిజన్ బీజేపీ అధ్యక్షులు గూడూరు శైలేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిశారు. డివిజన్‌లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని ఆదివారం ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఎన్ఎఫ్‌సీ బ్రిడ్జిని విస్తరించాలని కోరారు.

◆ సూర్యనగర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, సమస్యల గురించి సూర్యనగర్‌కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కురుమలకు సామాజిక భవనం కోసం స్థలం కేటాయించాలని సంఘం అధ్యక్షుడు బెల్లం బక్కయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. త్వరలోనే మల్లాపూర్‌లో ఎంపీ పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



అల్వాల్: బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని అల్వాల్ కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం అల్వాల్‌లోని కార్పొరేటర్ కార్యాలయంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. నరేందర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, చంద్రశేఖర్, లింగారెడ్డి, యాదగిరిగౌడ్, ప్రేమ్‌కుమార్, జార్జ్, సాజిద్, రహమత్‌ఖాన్, ఆరీఫ్, హన్మంతు, చంద్రమౌళి, మహేష్, లోకేష్, సతీష్, వాణినందిని, మాధవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దేశమే దేహము.. ధర్మమే ప్రాణం

ఆకట్టుకున్న గరికపాటి ప్రవచనం



గౌతంనగర్: ప్రధాని నరేంద్రమోదీ 75వ జన్మదినోత్సవం సందర్భంగా మల్కాజిగిరిలోని లక్ష్మీసాయిగార్డెన్స్‌లో ఆదివారం రాత్రి హనుమాన్‌చాలీసా, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం వారిచే నిర్వహించిన 'దేశమే దేహం-ధర్మమే ప్రాణం' అనే అంశంపై గరికిపాటి నరసింహారావుచే నిర్వహించిన 'స్వధర్మే నిధనం శ్రేయ' ప్రవచనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. కార్పొరేటర్లు ఉండవల్లి శ్రవణ్‌కుమార్, గున్నాల సునీతాశేఖర్‌యాదవ్, క్యానం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌గౌడ్

బోడుప్పల్: యువత క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌గౌడ్ అన్నారు. బోడుప్పల్‌లోని బొమ్మక్ బాలయ్య ఫంక్షన్‌హాల్‌లో విక్టరీ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, సీసా వెంకటేశ్‌గౌడ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థిపై సహ విద్యార్థుల దాడి

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని ప్రిన్సిపాల్, పోలీసులు
● కళాశాల ఎదుట విద్యార్థి కుటుంబసభ్యుల ఆందోళన



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు

మేడిపల్లి: బోడుప్పల్‌లోని ఓ కళాశాలలో చదువుతున్న విద్యార్థిపై దాడికి పాల్పడిన తోటి విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని కళాశాల ఎదుట ఆదివారం బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ పెద్ద వంగరకు చెందిన గణేష్ అనే విద్యార్థి బోడుప్పల్ ఎస్ఆర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతూ హాస్టల్‌లో ఉంటున్నాడు. అయితే ఈనెల 6వ తేదీన హాస్టల్ ఉంటున్న ముగ్గురు సహ విద్యార్థులు గణేష్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని గణేష్ తన కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు కళాశాలకు చేరుకుని గణేష్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలను తీసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్, మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆదివారం కళాశాల ఎదుట విద్యార్థి కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యార్థులను పిలిపించి మాట్లాడుతామని కుటుంబ సభ్యులను నచ్చజెప్పి పంపించారు.

దసరా ఉత్సవ నూతన కమిటీ

రామంతాపూర్: ప్రధాన రహదారిలో విజయదశమి రోజున నిర్వహించే రావణ సంహారమేళా దసరా ఉత్సవాల కమిటీని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ ఆదివారం నియమించారు. కమిటీ చైర్మన్‌గా బుర్ర రాజేశ్వర్, అధ్యక్షులుగా వల్లపు జగన్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా జగదీష్, ప్రధాన కార్యదర్శిగా బాలకృష్ణగౌడ్, సభ్యులుగా రేవు నరసింహ, సంతోష్ గుప్తా, వెంకటేష్, రవీందర్, శ్రీనివాస్, ఉపేందర్, ముత్యం దర్శనాల సుధాకర్, శైలేందర్, మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో నాట్య ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బండి ప్రేరణికుమార్ శిష్యబృందంచే నిర్వహించిన ఆంధ్రనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. ప్రార్థనగీతం, కుంభహారతి, పుష్పాంజలి, అలరిపు, వినాయక కౌతం, శివకైవారం, మూషికవాహన, సంధ్యా సమయం, దశావతారం, నవపారిజాతం తదితర అంశాలను కళాకారులు భావన, భవానీ, భవ్య, ఉజ్వల, మోక్షసారి, ప్రగతి, కేతన, బిందుప్రియ, సునీత, శ్రీజ, ధరణి తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



మల్లాపూర్: బ్రహ్మపురి కాలనీలోని భవానీరెసిడెన్సీ అపార్ట్‌మెంట్, సాక్షి ప్రింటింగ్ ప్రెస్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో అపార్ట్‌మెంట్‌వాసులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రెసిడెన్సీ వాసులతో కాంగ్రెస్ నేత ఎన్వీ కిట్టు సమావేశం నిర్వహించారు. అనంతరం గుంతలమయమైన రోడ్డును అపార్ట్‌మెంట్‌వాసులతో కలిసి పరిశీలించారు. రోడ్డు సమస్యను మందముల పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామని అపార్ట్‌మెంట్‌వాసులకు హామీ ఇచ్చారు. శ్యామ్‌సుందర్‌రెడ్డి, రహమాన్, ప్రశాంత్, సంతోష్, హరీష్, బాలరాజ్, శ్రీకాంత్, సన్నీ తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి

బోడుప్పల్: అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకునడవాలని అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య అన్నారు. ఆదివారం బోడుప్పల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన 343 జ్ఞాన మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. చెంగిచర్ల మాజీ ఉపసర్పంచ్ కొత్త రవిగౌడ్, నాయకులు రాపోలు శ్రీరాములు, యాకయ్య, బండారి సాయి, జడ శ్రీనివాస్, సవరపు బయన్న, భరత్ తదితరులు పాల్గొన్నారు.



'మిలాద్ ఉన్ నబీ' వేడుకలు



కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ జిల్లా పరిషత్ స్కూల్ సమీపంలో బీఆర్ఎస్ నేతలు మహ్మద్ జావేద్ ఆధ్వర్యంలో ఆదివారం 'మిలాద్ ఉన్ నబీ' వేడుకలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డిలు హాజరుకాగా.. వారిని శాలువాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, తోట నరేందర్‌రెడ్డి, డోలి రమేష్, ఢిల్లీ పరమేష్, జేఏసీ సురేందర్‌రెడ్డి, శోభన్‌బాబు, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కౌకూర్ రాజీవ్ గృహకల్ప వద్ద జలమండలి నిధులు రూ.13 లక్షలతో 150 ఎంఎం డయా డీఐ తాగునీటి పైపులైన్ పనులను కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే మైనంపల్లి సహకారంతో పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. కాంగ్రెస్ నేతలు బొబ్బిలి సురేందర్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీశైలంయాదవ్, రాజేందర్‌రెడ్డి, సర్వేష్‌యాదవ్, వెంకటేష్, శివరాజ్, విక్కీ, మల్లేష్, అసిపుల్లాఖాన్, కిరణ్, శంకర్, సత్తిరెడ్డి, తివారి, రామకృష్ణ, సుబేదార్‌యాదవ్, శంకరమ్మ, నాగరాజు, ప్రీతమ్, పుష్ప, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య కేసులో

మరో ఇద్దరి అరెస్ట్.!

● కొత్తగా తెరపైకి బోగారం భూ వివాదం ● కొనసాగుతున్న దర్యాప్తు



శ్రీకాంత్‌రెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

కుషాయిగూడ: హెచ్‌బీ కాలనీ, మంగాపురం కాలనీలో చోటు చేసుకున్న శ్రీకాంత్‌రెడ్డి దారుణహత్య దర్యాప్తు కొనసాగుతోంది. ధన్‌రాజ్‌యాదవ్, జోసఫ్‌లతో పాటుగా మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. వారిలో శ్రీకాంత్‌రెడ్డితో కలిసి వ్యాపారం చేసేందుకు పెట్టుబడి పెట్టిన లాలాపేట్‌కు చెందిన రౌడీషీటర్ ప్రధాన అనుచరుల్లో ఒకరైన సంతోష్‌తో పాటు అతడి బంధువు ముఖేష్ కూడా ఉన్నట్లు సమాచారం.

పెట్టుబడిపై పూర్తి సమాచారం

బల్లారిలో గత మార్చిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రౌడీషీటర్‌కు ధన్‌రాజ్, సంతోష్‌లు ప్రధాన అనుచరులుగా ఉండేవారు. వీరికి రూ.2 కోట్ల పెట్టుబడి విషయంపై పూర్తి సమాచారం ఉండటం, వారు ఆ విషయంపై శ్రీకాంత్‌రెడ్డిని ప్రశ్నించడం జరుగుతుండటంతో 'మీరు నాతో పాటుగానే ఉండండీ.. మీకు కావాల్సింది నేను చూసుకుంటానంటూ'.. గత కొద్ది నెలలుగా వెంట తిప్పుకొని ముఖం చాటేయడంతోనే ఇంతటి దారుణానికి ఒడిగట్టారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

18 ఎకరాల స్థలం లిటికేషన్‌ను తొలగించి..

లాలాపేట్‌కు చెందిన రౌడీషీటర్, శ్రీకాంత్‌రెడ్డితో కలిసి వ్యాపారం చేసేందుకు రూ.2 కోట్లు పెట్టుబడి పెట్టిన వ్యవహారం ఒకటైతే బోగారంలో 18 ఎకరాల స్థల వివాదం కూడా తాజాగా తెరమీదికొస్తోంది. లిటిగేషన్‌లో ఉన్న ఈ 18 ఎకరాల వెంచర్ స్థలంలో రాజకీయ పలుకుబడి కలిగిన పెద్దమనుషులు, శ్రీకాంత్‌రెడ్డితో కలిసి పార్ట్‌నర్స్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. స్థలానికి సంబంధించి లిటిగేషన్ క్లియర్ చేసే బాధ్యతలు శ్రీకాంత్‌రెడ్డే చూసి క్లియర్ చేసినట్లు సమాచారం.

వాటాల్లో తేడాలు..

శ్రీకాంత్‌రెడ్డి పెద్ద మొత్తంలో ఆశించడంతో వాటాల్లో తేడాలు వచ్చి గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. వాటాల్లో పెద్ద మొత్తంలో తేడాలు రావడాన్ని పార్ట్‌నర్స్ జీర్ణించుకోలేకపోతున్నారని, ఈ క్రమంలో జరిగిన శ్రీకాంత్‌రెడ్డి హత్యకు దీనికి ఏమైన సంబంధాలున్నాయా. ! అనే కోణంలోనూ పోలీసులు దృష్టి సారిస్తున్నట్లు సమాచారం.

సుఫారీ హత్యేనంటూ ఆరోపణలు..

శ్రీకాంత్‌రెడ్డిది ముమ్మాటికీ సుఫారి హత్యేనంటూ.. మృతుడి దగ్గరి మనుషులు అనుకోవడం.. హత్య కేసులో మరో ట్విస్టును తెరపైకి తీసుకువస్తుంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు నిష్పక్షపాతంగా కేసు దర్యాప్తు చేస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇక అమెరికాలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డి తల్లి, చెల్లెలు ఆదివారం తెల్లవారుజామున నగరానికి చేరుకోవడంతో మల్లాపూర్ శ్మశానవాటికలో అంత్యక్రియలను పూర్తి చేశారు.